క్లుప్తంగా

రంగస్థల కళాకారులకు సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న పాన్ ఇండియా సాంస్కృతిక సంస్థ నిర్వాహకులు

హుజూర్‌నగర్ : ప్రపంచ సామాజికవేత్తల దినోత్సవం సందర్భంగా విజయవాడలో పాన్ ఇండియా సాంస్కృతిక సంస్థ వారు శనివారం హుజూర్‌నగర్‌కు చెందిన సీనియర్ రంగ స్థల కళాకారుడు దొంతగాని సత్యనారాయణను సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఆయనతో పాటు కళాకారులు సీహెచ్.నాగయ్య, బీరోలు అఖిల, దాసరి సుకన్య, దొంతగాని మణిదీప్, డ్యాన్స్ మాస్టర్ వీర బాబును సత్కరించారు. ముందుగా హుజూర్‌నగర్‌కు చెందిన రంగ స్థల కళాకారులు అక్కడ నృత్య ప్రదర్శన చేసి ఆకట్టుకున్నారు.

మహిళా విభాగం జిల్లా జనరల్ సెక్రటరీగా ప్రియాంక



మఠంపల్లి : యూత్ కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా జనరల్ సెక్రటరీగా మఠంపల్లి మండలంలోని జామ్లాతండాకు చెందిన బానోతు ప్రియాంకభాస్కర్‌నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మఠంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా జనరల్ సెక్రటరీకి నిర్వహించిన ఎన్నికల్లో రెండు వందల ఓట్లకు పైగా మెజార్టీ సాధించినట్లు ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక



గుండు శ్వేత

నేరేడుచర్ల : మండల కేంద్రానికి చెందిన గుండు శ్రీహరి– సౌభాగ్యమ్మ దంపతుల కూతురు గుండు శ్వేత మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైంది. ఇటీవల టీ జీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌గా (హిందీ) ఉద్యోగం సాధించింది. అంతకు ముందు ఆమె గురుకుల టీజీటీ, పీ జీటీ ఉద్యోగాలకు కూడా ఎంపికైంది. ప్రస్తుతం ఆమె రంగారెడ్డి జిల్లా షాబాద్‌లోని మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో హిందీ అధ్యాపకురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. తల్లిదండ్రుల సహకారం, భర్త నగేష్, ప్రభుత్వ ఉద్యోగస్తులైన అక్కా– బావల సలహాలతో ఉద్యోగాలు సాధించినట్లు ఆమె తెలిపారు.

వివాహిత అదృశ్యం



సంధ్య

హుజూర్‌నగర్: వివాహిత అదృశ్యమైందని ఆమె భర్త శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన జర్పుల సంధ్యకు మఠంపల్లి మండలం పాతదొనబండ తండాకు చెందిన బాణోత్ కోటేశ్వరరావుతో వివాహం జరిగింది. వీరు కొన్ని రోజుల నుంచి హుజూర్‌నగర్ పట్టణంలో నివాసముంటున్నారు. సంధ్య అనుశ్రీ ఇనిస్టిట్యూట్‌ నందు బ్యూటీషియన్ ఫ్యాకల్టీగా పనిచేస్తోంది. శుక్రవారం సాయంత్రం ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆమె భర్త కోటేశ్వరరావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గడ్డివాము దగ్ధం

మోతె : గడ్డివాము దగ్ధమైన ఘటన మోతె మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం వెనకాల బండపై రైతు ఐతబోయిన జగ్గయ్యకు చెందిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించారు. దీంతో సుమారుగా 80 గడ్డిమోపులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రస్థాయి సదస్సుకు తరలిన ఐఎన్‌టీయూసీ నాయకులు



రవీంద్రభారతిలో ఐఎన్‌టీయూసీ నాయకులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సుకు హుజూర్‌నగర్ నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ నాయకులు శనివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సదస్సులో దిశానిర్దేశం చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్, నాయకులు చిట్యాల అమర్‌నాథ్‌రెడ్డి, యరగాని గురువయ్య, బెల్లంకొండ గురువయ్య, పాశం రామరాజు, ముక్కంటి, చింతకాయల రాము, రాజు, ముస్తాఫా, నాగేందర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన సన్నాల సాగు

- 30 బస్తాలకు తగ్గకుండా వస్తున్న దిగుబడి
- గతంతో పోల్చుకుంటే పెట్టుబడి, తెగుళ్ల బెడద కూడా తక్కువే
- కొనుగోలు కేంద్రాలతో పాటు బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

కోదాడరూరల్ : ఈ ఏడాది వరి సాగు చేసిన రైతులకు ఆశించిన దిగుబడి రావడంతో పాటు ధర కూడా బాగుండటంతో అన్నదాతలు ఆనందంగా ఉన్నారు. ఎప్పుడు దిగుబడి ఉంటే ధర ఉండక పోవడం, ధర ఉంటే దిగుబడి రాకుండా ఉండేది. ఈ ఏడాది కోతల సమయంలో గాలి దుమ్ములకు పంట నేలకొరిగి కొద్దిగా నష్టం జరిగినా... గతంతో పోల్చుకుంటే తెగుళ్ల బెడద, పెట్టుబడి కూడా తక్కువ కావడం దిగుబడి కూడా 30 బస్తాలకు తగ్గకుండా వస్తుండటంతో రైతుల మొఖంలో సంతోషం కనిపిస్తుంది. డివిజన్‌లో ఇప్పటి వరకు 60శాతం కోతలు పూర్తికాగా మరో 40శాతం పంటల కోతలు కొనసాగుతున్నాయి.

డివిజన్‌లో లక్ష ఇరవై వేల ఎకరాల్లో ....

కోదాడ డివిజన్‌లోని ఆరు మండలాల్లో ఈ ఏడాది వానాకాలం లక్ష ఇరవై వేల ఎకరాల్లో వరిసాగు నమోదు అయింది. ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి మద్దతు ధర క్వింటాళ్లకు రూ.2320తో పాటు ఎన్నికల హామీలో ఇచ్చిన రూ.500 బోనస్‌ను ఇస్తామని ప్రకటించడంతో కోదాడ డివిజన్‌లో 99శాతం మంది రైతులు సన్నరకాలైన సాంబమసూరి, చింట్లు, హెచ్‌ఎంటీ, ఆర్‌ఎన్‌ఆర్ వంటి వాటివైపే మొగ్గు చూపారు. ఇక వానాకాలం సీజన్‌లో పంటను ఆశించే దోమపోటు, సుడిదోమ, ఆకుచుట్ట పురుగు, మొగిపురుగు వంటి తెగుళ్లు ఈ ఏడాది సోకలేదు. దీంతో రైతులు రసాయనిక మందులను కూడ స్ప్రే కూడా తక్కువే చేశారు.

వర్షాలు సమృద్ధిగా పడటంతో...

వరిసాగు ప్రారంభం అయినప్పటి నుంచి పంటకు కావాల్సిన వర్షాలు సమృద్ధిగా పడటంతో బావులు, బోర్లలతో భూగర్భ జలాలు పెరగడంతో సాగర్ ఆయకట్టు ప్రాంతమైన డివిజన్‌లో సాగర్‌నీరు రావడంతో రైతులు ఉత్సాహంతో సాగు చేపట్టారు. వరిపైరుకు కావాల్సిన విధంగా నాటు పెట్టిన నాటి నుండి 2 నెలల వరకు విస్తారంగా వరాషలు కురవడంతో నత్రజని అవసరం లేకుండానే పెరిగింది.

బోనస్ కూడా...

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యానికి మద్దతు ధర రూ.2320తో పాటు బోనస్ రూ.500 కూడా ఒకటి రెండు రోజుల తేడాతో వారి ఖాతాలో జమ అవుతున్నాయి. ఇక కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి వాటిని ఆరబెట్టి, తూర్పాల పట్టి , ఎప్పుడు వర్షం వస్తుందో తెలియక ఆందోళన చెందాలని కొందరు రైతులు వెంటనే స్థానికంగా, మిల్లర్‌లకు, మార్కెట్‌లకు తరలించి పచ్చి ధాన్యాన్ని విక్రయించుకున్నారు. పచ్చి ధాన్యం కూడ క్వింటాళ్లకు మార్కెట్‌లో డిమాండ్ బట్టి రూ.2200 నుంచి రూ.2800 వరకు అమ్ముకున్నారు.

ఎకరానికి 34 బస్తాల దిగుబడి



ఈ ఏడాది 8 ఎకరాల్లో సన్నరకం ధాన్యాన్ని వరి సాగు చేశా. ఎకరానికి 34 బస్తాల దిగుడిబడి వచ్చింది. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది పంటకు రోగాలు, పెట్టుబడి కూడ తక్కువగానే వచ్చింది. మార్కెట్‌లో ధాన్యానికి కూడ ఈ ఏడాది మంచి ధర ఉండటంతో ఆనందంగా ఉన్నాం.

– బందారపు మల్లికార్జున్, కెఆర్సీపురం

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై ఫిర్యాదు



కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వెలమ సంఘం నాయకులు

కోదాడరూరల్ : వెలమ కులస్తులను తీవ్ర పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని వెలమ కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల వెలమ కుల సంఘం నాయకులు శనివారం ర్యాలీగా వెళ్లి కోదాడ పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యతయుతమైన పదవిలో ఉన్న ప్రజాప్రతినిధి సంఘ వ్యతిరేక వ్యాఖ్యలతో రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. ఆయన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని వెలమ కులస్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వేనేపల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తీగల కరుణాకర్‌రావు, ఉపాధ్యక్షుడు గుండపనేని కొండల్‌రావు, రౌతు వెంకటేశ్వరరావు, నేలవెల్లి శ్రీనివాసరావు, అమరనేని శేషగిరిరావు, గుండపునేని నాగేశ్వరరావు, పందిళ్లపల్లి పుల్లారావు, కాచవరపు కృష్ణారావు, వేణుగోపాలరావు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

మునగాల : మండల కేంద్రంలో బాల్య వివాహాన్ని చైల్డ్ హెల్ప్ లైన్, ఐసీడీఎస్ సిబ్బంది అడ్డుకున్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా సూపర్‌వైజర్ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాలకు చెందిన ఓ మైనర్ బాలికకు వివాహం చేసేందుకు తన తండ్రి ఏర్పాట్లు చేశాడు. శుక్రవారం సదరు మైనర్ బాలిక ప్రధాన కార్యక్రమం జరుగుతుండగా ఐసీడీఎస్ సిబ్బంది అక్కడికి చేరుకొని వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికకు కేవలం 14 ఏళ్లు మాత్రమే ఉన్నందున మేజర్ అయ్యేవరకు వివాహం చేయవద్దని బాలిక తండ్రికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మేజర్ అయ్యేంతవరకు వివాహం జరిపించనని హామీ పత్రం తీసుకున్నారు. దీంతో బాలిక వివాహం నిలిచిపోయింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ మునగాల సెక్టార్ బెజవాడ సరిత, అంగన్‌వాడీ టీచర్లు ఎల్లమ్మ, కమల, మణెమ్మ, మాణిక్యం, రూప, సంధ్యారాణి పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



మఠంపల్లి : భీల్యానాయక్‌తండాలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

మఠంపల్లి : యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్ కోరారు. శనివారం మండలంలోని భీల్యానాయక్ తండలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ గ్రామ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అదేవిధంగా మఠంపల్లి జడ్పీ హెచ్‌ఎస్‌లో క్రీడా పోటీలను హెచ్‌ఎం మౌలాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు రాము, దుర్గాప్రసాద్, శేషిరెడ్డి, పీడీలు వెంకటేశ్వరరావు, నరేష్ పీఈటీలు ముక్కంటి, సతీష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యాయులు, సూర్యనారాయణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

10 నుంచి సీఎం కప్ క్రీడలు

మునగాల : ఈనెల 10వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించబోయే మండల స్థాయి సీఎం కప్ క్రీడలను జయప్రదం చేయాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్థాయి క్రీడల్లో అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో మండల విద్యాధికారి పి.వెంకటేశ్వర్లు, స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.ఆజాంబాబా, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ చేయాలని మంత్రికి వినతి

కోదాడరూరల్ : మండలంలోని గణపవరంలో రుణమాఫీ వర్తించని రైతులకు మాఫీ వర్తించేవిధంగా చూడాలని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి కోదాడకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈమేరకు వినతిపత్రం కోరారు. రుణమాఫీ వర్తించని రైతుల వివరాలను మంత్రికి అందజేశారు. అర్హత ఉన్న రైతులకు తప్పకుండా మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపినట్లు పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న హరికిషన్ కుటుంబ సభ్యులు

మునగాల : మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు, సీనియర్ జర్నలిస్టు చిల్లంచర్ల హరికిషన్ జ్ఞాపకార్థం శనివారం ఆయన కుటుంబసభ్యులు మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయి రఘు, నాగమణి, చిల్లంచర్ల రవీంద్రనాథ్, కందిబండ సత్యనారాయణ, చిల్లంచర్ల ప్రభాకర్, గిరి, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ పాల్గొన్నారు.

ఆడపిల్లల భద్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీఎస్సీ విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు శనివారం గడ్డిపల్లిలో గల అరబిందో పాఠశాలలో విద్యార్థులకు ఆడపిల్లల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్రికల్చర్ విద్యార్థులు మాట్లాడుతూ ఆడపిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో సమాజంలో ఎలా ధైర్యంగా ముందుకెళ్లాలో వివరించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ విద్యార్థులు అనిత, అన్మిష, వర్షితరెడ్డి, అశ్విని, దీక్షిత, దివ్య, లావణ్య, నేహ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి విరాళం



స్థలాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మోతె : మండలంలోని రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన కారింగుల రఘుపతి జ్ఞాపకార్థం వారి కుమారుడు కారింగుల జానయ్య–లక్ష్మీనర్సమ్మ 2 గుంటల భూమిని శనివారం విరాళంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, పంచాయతీరాజు ఏఈ రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల



పాలకవీడు : పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మి

పాలకవీడు : మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిమిత్తం పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మండల కేంద్రంలో శనివారం ఎంపీడీఓ లక్ష్మి విడుదల చేశారు. మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో 186 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీ లోగా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని కోరారు.

మునగాలలో..

మునగాల : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ రెండో విడత సాధారణ ఎన్నికల్లో భాగంగా మునగాల మండలంలోని 22 గ్రామ పంచాయతీల పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల కార్యాలయాల్లో ఆదివారం నుంచి నోటీస్ బోర్డుపై కేంద్రాల జాబితాలు అందుబాటులోకి వస్తాయన్నారు. పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా దరఖాస్తు ఇవ్వాలని కోరారు. మండల పంచాయతీ అధికారి దార శ్రీనివాస్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

నడిగూడెంలో..

నడిగూడెం : గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 148 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

మాలధారణతో మానసిక ప్రశాంతత



అన్నదానంలో పాల్గొన్న దాతలు, నిర్వాహకులు

కోదాడరూరల్ : మాలధారణతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింకుంట్ల రాంరెడ్డి అన్నారు. శనివారం కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల గాలి రమేష్ నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు న్యాయవాది టి.సీతారామరాజు– మంజుల దంపతులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



వస్తువులు అందజేస్తున్న ఎంఈఓ, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

చిలుకూరు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంఈఓ ఎం.గురవయ్య అన్నారు. మండలంలోని బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శనివారం బేతవోలు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.25 వేలు విలువ గల కంప్యూటర్, జిరాక్స్ మిషన్, ప్రింటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చందా శ్రీనివాస్‌రావు, బేతవోలు ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గుండు వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు గడ్డం కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కందరబోయిన వీరస్వామి, సభ్యులు శశిధర్, రామకృష్ణ, నరసింహారెడ్డి, వీరబాబు, నాగరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కోదాడ సీనియర్ సివిల్ జడ్జి సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సురేష్

కోదాడరూరల్ : జాతీయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోదాడ సీనియల్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.సురేష్ అన్నారు. శనివారం కోదాడ కోర్టులో లోక్ అదాలత్‌పై న్యాయవాదులు, పోలీసు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులలో కక్షిదారులు రాజీ పడి తమ ధనాన్ని, సమయాన్ని ఆదా చేసుకోవడంతో పాటు ప్రశాంతంగా జీవించాలన్నారు. కేసుల్లో రాజీపడే విధంగా కక్షిదారులకు న్యాయవాదులు, పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ నాయకులు గట్ల నర్సింహారావు, చింతకుంట్ల రాంరెడ్డి, ఏపీపీ సిలివేరు వెంకటేశ్వర్లు, కల్యాణి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



హుజూర్‌నగర్ : ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న మెప్మా ఆర్పీలు



మునగాల : సాయిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్ : తమ సమస్యలు పరిష్కరించాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో పని చేస్తున్న ఆర్పీలు శనివారం హుజూర్‌నగర్‌లోని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు గత 5 నెలలుగా వేతనాలు రావడం లేదని, ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేల గౌరవ వేతనం కుటుంబ పోషణకు సరిపోవడం లేదని నెలకు రూ.26 వేలు ఇప్పించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. తమకు సకాలంలో వేతనాలు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి ఆర్పీల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీల సంఘం అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సునిత, కోశాధికారి కంచర్ల రమణ, ఉపాధ్యక్షురాలు రాయల లక్ష్మి, సహాయ కార్యదర్శి నాగమణి, ఆర్పీలు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయికి సన్మానం

మునగాల : యూత్ కాంగ్రెస్ మునగాల మండల అధ్యక్షుడిగా ఎన్నికైన తక్కెళ్లపాటి సాయిని శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉప్పుల జానకిరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే పద్మావతి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో యూత్ కాంగ్రెస్‌ను పటిష్టం చేసేందుకు కృషిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వంగవేటి రామారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఎలక నరేందర్‌రెడ్డి, కాసర్ల కోటేశ్వరరావు, పార్టీ మండల నాయకులు ఉప్పుల జానకిరెడ్డి, మట్టయ్యయాదవ్, వీరబాబు, గోపి, రవి, సామియేలు, వెంకట్, పాషా పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల రిలే నిరాహార దీక్ష



హుజూర్‌నగర్ : రిలే నిరాహార దీక్ష చేస్తున్న సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు

హుజూర్‌నగర్ : సర్వ శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ)లో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు శనివారం హుజూర్‌నగర్‌లోని మండల వనరుల కేంద్రం వద్ద రిలే నిరాహార దీక్షను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీనివాస్, గోవింద్, సైదులు, బ్రహ్మం, రమేష్, అలీం, సమీనా, రాజు, శేఖర్, రవి, లక్ష్మి, ఉషా రాణి, మున్నీ బేగం, విజయలక్ష్మి, బాల సైదులు, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నడిగూడెం : సర్వ శిక్షా అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) లో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పలువురు నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు వారు మద్దతు తెలిపి మాట్లాడారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వరరావు, నాయకులు ఉట్కూరు సురేష్, మండల ప్రధాన కార్యదర్శి పల్లపు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు బూరుగడ్డ థామస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం బస్తాల చోరీకి యత్నం

- లారీలో నుంచి ఆటోలో వేస్తుండగా పట్టుకున్న పోలీసులు

మోతె: ఐకేపీ కేంద్రం నుంచి ధాన్యం బస్తాలతో మిల్లుకు వెళ్తున్న లారీలోంచి కొన్ని బస్తాలను ఆటోలో వేస్తుండగా మోతె పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున మోతె మండలం రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండల కేంద్రానికి చెందిన జిల్లపల్లి చిరంజీవి లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన లారీలో శుక్రవారం నేరడవాయి గ్రామ ఐకేపీ కేంద్రం నుంచి ధాన్యం బస్తాలు లోడు చేసుకొని కోదాడలోని రైస్ మిల్లుకు బయల్దేరాడు. మార్గమధ్యలో రాఘవాపురం ఎక్స్ రోడ్డు వద్ద శనివారం తెల్లవారుజామున లారీ ఆపి అందులోని ఆరు బస్తాలను తన బంధువులు నవిల హుస్సేన్, పూజల భాస్కర్‌కు చెందిన ఆటోలో వేస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించి చిరంజీవి, హుస్సేన్, భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మోతె : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా బోధన, భోజన వసతులు పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలుగు వీరన్న, కార్యకర్తలు బొడ్డు నర్సయ్య, గడ్డం రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

కోదాడ : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం స్థానిక వాసవి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఇమ్మడి అనంత చక్రవర్తి, డాక్టర్ వంగవేటి భరత్ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో అన్ని రకాల వ్యాధులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన మీర్జా జాన్‌బీ (65) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం. దీంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ. 5 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పందిరి వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండు శ్రీనివాస్, నాయకులు బోళ్ల నర్సిరెడ్డి, గుండు శ్రీను, పల్లపు శ్రీనివాస్, మౌలానా, గుండు మహేందర్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీపార్వతీ భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్టి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపారు. అనంతరం అన్న సమారాధన గావించారు. పూజారులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

గుండ్ర జోజిరెడ్డికి నివాళి



జోజిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పాలకవీడు : మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు గుండ్ర చిన జోజిరెడ్డి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంతప్రకాష్ కోరారు. శనివారం గుడుగుంట్లపాలెంలో జోజిరెడ్డి చిత్రపటానికి ఆయన పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోజిరెడ్డి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, దిద్దకుంట్ల పురుషోత్తంరెడ్డి, దొంగల వెంకటయ్య, బొడ్డుపల్లి వెంకటయ్య, రాంరెడ్డి, నందయ్య, అమరారెడ్డి, వెంకట్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

హుజూర్‌నగర్‌రూరల్ : సొంతిళ్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుగ్గి బ్రహ్మం, మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు, పెన్షన్లు మంజూరు చేసిన పాపాన పోలేదని ఆరోపించారు. వికలాంగులు సదరం సర్టిఫికెట్లు తెచ్చుకుని పెన్షన్ కోసం పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. ఇళ్లు లేని వారు ఆశతో ఇళ్ల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యురాలు తంగెళ్ల వెంకటచంద్ర, మాదూరి నర్సింహాచారి, నూకల లక్ష్మి, వెంకటయ్య, భిక్షం, వెంకటేశ్వర్లు, గోపి, సైదులు తదితరులు పాల్గొన్నారు.